కేంద్రంగా ఉండే ప్రాంతం రాష్ట్రకేంద్రంగా ఉండాలని కోరటం ప్రజాస్వామిక సూత్రాలకు అనుగుణం. ఆంధ్రప్రజల సమష్టిజీవితానికి అటువంటి కేంద్రం మాత్రమే దోహదమిస్తుంది. అలాగాకుండా ఏదో ఒక మూలకు లాగి మద్రాసు లేక విశాఖపట్నం లేక హైదరాబాదు అనటం ప్రజాజీవిత ప్రయోజనాలు గుర్తించడం కాదు.

తెలంగాణాజిల్లాలు ఆంధ్రరాష్ట్రంలోకి వచ్చే ముందు రాయలసీమ సమస్య ఉంది. వారు కోరే హామీలగురించి సర్కారు ప్రాంతం ప్రజాప్రతినిధులు చర్చించాలి. 1937 లో అంగీకరించిన శ్రీ బాగ్ ఒడంబడికను నేటి పరిస్థితులకు అన్వయించి మార్పులు చేయాలి. 1937 లో రాయలసీమ-సర్కార్ ఆంధ్రులు ఒక ఒడంబడికకు వచ్చినపుడు 1949 లో ఎందుకు రాలేరు? రాష్ట్రనిర్మాణ దృష్టితో ప్రజాక్షేమం కొరకు ఇటువంటి ఒడంబడిక అత్యవసరం. ముఖ్యపట్టణ నిర్ణయంగూడా ఈ ఒడంబడిక మీదనే ఆధారపడి ఉంది.

త్రిమూర్తుల నిర్ణయం మొదలుకొని ఆంధ్ర నాయకుల మధ్య గల చీలికల వరకు చూస్తే ఒకటి స్పష్టం. ప్రజా జీవితాన్ని పెంపొందించే నిర్మాణాత్మక దృష్టి, ప్రజాస్వామిక ఆశయం నానాటికి నాయకులలో లోపిస్తున్నవని చెప్పక తప్పదు. అటువంటి పరిస్థితి ఏర్పడినప్పుడే ప్రజాస్వామ్య జీవితం దెబ్బ తింటుంది. ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రజల న్యాయమైన ప్రజాస్వామ్యపు కోర్కె. ఆంధ్రరాష్ట్ర సమస్యయొక్క కీలకమే మదరాసు నగర సమస్య అయినట్లుగా తీసుకుని, ఆశయసిద్ధినే వాయిదా వేస్తున్నా మన్న విషయం, ఆంధ్ర ప్రజలు గుర్తించడం అవసరం.

# ముత్యపు చిప్పలు

'సుందర్'

కేశవరావు పదేళ్ళబట్టీ ఆ వూరులోనే ఉంటూన్నాడు. దగ్గరగా లోతైన సముద్రమూ, పల్లెటూరులో ఉండే ప్రశాంతతా, దేశదేశాలూ తిరిగితిరిగి వచ్చిన ఆతన్ని ఆ వూళ్లోనే స్థిరపడే లాగ చేశాయి.

ఇదివరకు ధనవంతుడే, కాని మనస్సులో ఏదో అశాంతివల్ల చాలా డబ్బుని దానధర్మాలక్రింద సద్వినియోగం చేసివేయడంవల్ల, ఇప్పుడు కష్టపడ నక్కరలేకుండా కాలుమీద కాలువేసుకొని జీవితం గడపడానికి మాత్రమే మిగిలింది. పైగా ఒంటరిగాడు!

ఎంతమంది వద్దన్నా సముద్రానికి దగ్గరగా ఒక చిన్నఇల్లు కట్టుకొన్నాడు. ఏడాది ఏడాదీ ఇసుక, గాలివల్ల, వెనక్కి వెనక్కి మేటవేస్తూంది. క్రమంగా కొంతకాలానికి అతని ఇంటి ప్రహారీ గోడదాకా వచ్చేసింది. లోపలికూడా వచ్చేస్తుందేమో ఇసుకదిబ్బ అని కొంతమంది భయపడ్డారు.

ఆతని కాభయమే లేదు. అసలు భయమంటేనే తెలియని మనిషి.

* * *

వెన్నెలఉన్నా లేకపోయినాసరే, ప్రతీరాత్రీ ఆతనికి కొత్తగా కొట్టుకువచ్చిన ముత్యపు చిప్పల్ని ఏరుకొంటూ ఆ సముద్ర తీరాన కూర్చోడం నిత్యవిధి. కూర్చుని కూర్చుని తెల్లవారుతూందనగా ఇంటికివెళ్ళి పడుకొనేవాడు. అంతకీ బద్ధకంగాఉంటే అక్కడే నిద్రపోయేవాడు.

అతని ధోరణి చాలా చిత్రంగా ఉండేది. ఎందుకలా తీరానకూర్చుని కాలంగడుపుతాడో ఎవరికీ తెలీదు. ఆతనికి ఏకాంతమే జీవిత పరమావధి.

ఆరాత్రి పౌర్ణమి. ఆనందంతో హృదయాల్ని కూడా ఉప్పొంగచేయగల వెన్నెల. సముద్రం తన ఉద్రేకాన్నంతా ఎత్తైన తెల్లటి కెరటాలద్వారా వెలిబుచ్చుకొంటూంది.

ఆ రాత్రి వెన్నెలా, ఆ సముద్రపుహోరూ, ఆ ప్రకృతీ చూస్తున్నకొద్దీ ఆనందానుభవంతో మైకాన్ని కల్పిస్తాయి ప్రతీ మానవునికీ.

కాని అయనికిమాత్రం, ఆ ఆనందమూ, వెన్నెల చల్లదనమూ తెలియనే తెలియదు. అతణ్ణి లోకంలో సుఖపెట్టగలిగినది ఒక్కటీ లేదు.

* * *

అత డొక భగ్నజీవి. చేతులారా తన ఆనందాన్నీ సుఖాన్నీ తనంతట తానే జీవితంలో నుంచి చెరిపివేసుకొన్న మూర్ఖుడు. తెగత్రాగి మైకంతో ఒళ్లు తెలియక, కారుని చెట్టుకి ఢీ కొట్టించి, ముద్దు లొలికే ఏడేళ్ల కూతురు శాంతనీ, అతి ప్రియమైన భార్యనీ చేతులారా చంపుకున్న హంతకుడు. వాళ్లిద్దరూ చనిపోగా, బలమైన దెబ్బలు తగిలి, చేసుకొన్న పాపాన్ని అనుభవించడానికా అన్నట్లు జీవంతో తానొక్కడే బయట పడ్డాడు. తను బ్రతకడ మెందుకు?

ఎవరి సుఖం కోసం? తన జీవిత జ్యోతు లారిపోయాక. తన తప్పు తను తెలుసుకొన్నాక ఆతనికి జీవితము దుర్భరమై పోయింది. ముందర ఆత్మ హత్య చేసుకోవడమే తన తప్పుకి తగిన దండన అనుకొన్నాడు. కాని తను బ్రతికినన్నాళ్లూ బ్రతికి, చనిపోయిన వాళ్ల ఉసురు పోసుకొంటూ, బాధపడి జీవించకపోతే వాళ్ల ఆత్మలకి శాంతి ఉండదని ఆతనికో పిచ్చి ఊహ తోచింది. అందుచేతే అలా చావలేక బ్రతుకుతున్నాడు. మనుష్యులన్నా వారితో మాట్లాడడమన్నా అసహ్యం పుట్టింది. అందువల్లే ఆ సముద్రతీరాన అలా కూర్చుని కాలం గడుపుతాడు.

* * *

ఆ పౌర్ణమి రాత్రి... తెల్లని వెన్నెల్లో దూరాన ఉన్న వస్తువులు కూడా అస్పష్టంగా కనపడుతున్నాయి. అలలు మరీ ఎక్కువగా రావడంవల్ల ఎక్కువ ముత్యపు చిప్పలూ, ఇంకా చిన్న చిన్న శంఖాలూ అవీ కొట్టుకొస్తున్నాయి. వాటిని ఏరడంతోటి, కేశవరావుకి చాలా పని తగిలింది. ఆయాసమూ విసుగూ లేకుండా, వంచిన తల ఎత్తకుండా బాగున్న ప్రతీదీ ఏరుతూనే ఉన్నాడు.

అప్రయత్నంగా ఒకమాటు తలెత్తి చూశాడు. దూరాన్నుంచి, ఒక చిన్న పిల్ల చేతిలో ఒక చిన్న పేము బుట్టతో ముత్యపు చిప్పలు ఏరుకొంటూ వస్తూంది మెల్లిగా ఒంటరిగానే. వెన్నెల్లో ఆ తెల్లని పిల్ల ఒళ్లు మరీ తెల్లగా మెరుస్తూంది.

కేశవరావు తన కళ్లని నమ్మలేక పోయాడు. మొదట ఏదో భ్రాంతి అనుకొన్నాడు. కాని ఆపిల్ల క్రమంగా సమీపిస్తూందని తోచగానే తనకళ్లని తుడుచుకొని పెద్దవి చేసుకొని చూస్తున్నాడు. తలలో ఎన్నో ఆలోచనలు పరిగెడుతున్నాయి. తన శాంత కన్యాకుమారీ తీరంలో ముత్యపు చిప్పలు ఏరుకోవడం, కెరటంవచ్చి తడిపేయడం....ఎన్నో. శాంతకి అవంటే ఎంతఇష్టమో! అంచేతే ఆ పిల్లని తల్చుకొంటూ తను అలా ముత్యపుచిప్పల్ని ఏరుకొంటూంటాడు కూడా.

ఆపిల్ల శాంత అవుతే బాగుండును అనుకొన్నాడు. ప్రార్థించాడు దేవుణ్ణి. కాని ఏం చేయాలో తెలియక అలా నిలబడిపోయాడు. అప్పటివరకూ ఏరిన మంచిరకాల ముత్యపు చిప్పల పోగుదగ్గర.

ఆపిల్ల సమీపిస్తూంది. తొమ్మిదేళ్లుంటాయి. చాలా తెల్లగా ఉంది. గిరజాలజుట్టు మెడదాకా మాత్రమే. ఆ గుండ్రటికళ్లూ, ముక్కుతీరూ, చిన్ననోరూ అంతా శాంతతీరే, ముమ్మూర్తులా శాంతే అనిపించింది.

ఇంతలో ఆ అమ్మాయి ఎదురుగుండా మెరుస్తూన్న ఆ పోగూ, విగ్రహంలా దాని పక్కన నిలుచున్న ఆ మనిషినీ చూసి గబుక్కున ఆగిపోయింది. ఆ రాశిలో ఉన్న మంచిరకాల్ని తీసుకోవాలని ఉంది. కాని ఆ కొత్తాయన అలా నిలబడ్డం చూసి భయంవేసింది. కొంచెంసేపు మాత్రం ఆగి వెనక్కి తిరిగింది.

ఇంతలో ఏమనుకొన్నాడో, కేశవరావు, 'శాంతా' అని ఒక్కసారి మెల్లిగా పిల్చి, ఆ అమ్మాయిదగ్గరికి వెళ్లేడు. కంగారుపడుతూ అమ్మాయి నాపేరు శాంత కాదు అని ఇంగ్లీషులో జవాబిచ్చింది. ఆ మాటలు వింటూనే ఆపిల్లని దగ్గిరికితీసుకొని, ముద్దుపెట్టుకొంటూ, గుండెకి దగ్గ

రిగా హత్తుకొన్నాడు. నిజంగా తన శాంత మళ్ళీ తనకోసం తిరిగి వచ్చిందనే సంతోషంతో తన్ని తాను మరిచిపోయాడు.

ఆపిల్లకి కంగారు ఎక్కువయింది. ఊపిరాడకుండా చేస్తూన్న ఆమనిషిని చూసి, నా పేరు శాంత కాదు ఎలాన్ ప్లీజ్ అని ఇంగ్లీషులో చెప్పుతూనే ఉంది. కాని అతనికి అవేమీ వినపడటంలేదు. ఆ అమ్మాయిని ఎత్తుకొని తను ఏరినవాటి దగ్గరకు తీసుకువెళ్ళి మంచివన్నీ ఒకొక్కటే ఆచిన్ని చేతిలో పెడుతూన్నాడు. వాటిని చూసి మురిసిపోయి తన భయాన్నంతా పోగొట్టుకొంటూ, ఆ అమ్మాయిఒకొక్కటీ తన బుట్టలో పడేసుకొంటూంది.

ఆమెవేపు చూస్తూ ప్రపంచాన్నే మరిచిపోయాడు. తన దుఃఖాన్ని చూడలేక మళ్ళీ తనకోసం వచ్చిందని భావించాడు.

ఆ పిల్ల స్వయంగా ఏరుకుంటూంది, సంతోషంతో వికసించిన ముఖంతో.

ఆ ముఖాన్ని చూస్తూనే 'శాంత' అని ఇసుకలో వ్రాయడం మొదలుపెట్టేడు. 'శాం—' ఎక్కడినుంచో ఒక సన్నని పిలుపు. హృదయాన్ని గట్టిగా అదుముకొని తొందరతో వణుకుతూన్న వ్రేళ్లతో 'త' కూడా పూర్తిచేశాడు.

ఇంతలో ఎలాన్ ఎలాన్ అని ఒకసన్నని పిలుపు. రంగురంగుల ముత్యపు చిప్పల్తో నిండిపోయిన బుట్ట పట్టుకొని నించుంది ఎలాన్. వెనుకనుంచి ఒక యూరపియను దంపతులు ఎలాన్ని పిలుస్తూ వస్తూన్నారు. వాళ్ళని చూసి మదర్—అని కేక వేసి సంతోషంతో తల్లివైపు పరిగెత్తింది. కాని రెండు అడుగులు వేయగానే చేతిలో బరువువల్ల క్రింద పడిపోయింది. ఏరిన వన్నీ క్రింద మెరుస్తూన్న ఇసుకలో ఒలికి పోయాయి. చప్పున కేశవరావు వెళ్ళి అన్నీ బుట్టలోకి ఏరి ఆ అమ్మాయి చేతి కిచ్చాడు. ఇంతలో ఆ దంపతులుకూడా దగ్గిరికి వచ్చారు. ఆ బుట్టని తల్లి చేతికిస్తూ ఇవన్నీ ఈయన ఏరిపెట్టేడే అని చెప్పింది. వారిద్దరూ అతన్ని అభినందించి, ఆ పిల్లని తీసుకు వెళ్ళిపోయారు.

కేశవరావు అలా చూస్తూ ఉండిపోయాడు. కళ్ళనిండా నీరు క్రమ్ముకోవడంవల్ల వాళ్లెలా వెడుతూందీ కనపడలేదు. చప్పుని వాళ్ళదగ్గరికి వెళ్లి ఆ పిల్లను తన కిమ్మని అడుగుదామనుకొన్నాడు. కాని తను కదలేసరికి వాళ్ళా ప్రాంతాల్లోనే లేరు. హృదయాన్ని ముంచేస్తూన్న దుఃఖంతో కళ్ళని తుడుచుకొన్నాడు.

ఒక్కసారి జీవితాన్నంతా అర్థం చేసే నిస్పృహతో సముద్రంవంక చూశాడు. ఒక పెద్ద తెల్లని కెరటం వచ్చి తను వ్రాసిన 'శాంత'ని చెరిపివేసింది.

* * *

వెన్నెల్లో మెరుస్తూ తెల్లని కెరటాలు పైపైకి లేస్తూన్నాయి.

ప్రతీ కెరటమూ ఒడ్డుకొచ్చి చితికిపోయి తెల్లదనాన్ని పోగొట్టుకొంటూంది.

పెద్దకెరటం వచ్చినపుడల్లా రంగురంగుల ముత్యపుచిప్పలు కొట్టుకువస్తూనే ఉన్నాయి. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూనూ.

